# పద్మప్రియ

ఇప్పుడు కాస్త ప్రశాంతంగా ఉంది. ఉల్లాసంగా ఉంది. మనసుకు ఏదో మలయ మారుతం తాకినట్టుగా ఉంది. నిజానికి మనిషికి బయటి ప్రపంచంతో వుండే అనుబంధం ఎంత బలీయమైనది... మనిషిలో కొత్త ఆశలను చిగురింపచేసేదీ, మనిషి మనసుకు తృప్తినిచ్చేది బయటి ప్రపంచమే. మనిషి బయటి ప్రపంచంతో పెనవేసుకున్న అనుబంధం అద్వితీయమైనది. మనిషి ఎంతగా ఏకాగ్రతను కోరుకున్నా బయటి ప్రపంచంతో పూర్తిగా బాంధవ్యాన్ని త్రుంచుకుని బతకడం చాలా కష్టం.

గతవారం రోజులుగా ఎమర్జన్సీ వార్డులో వుండడంవల్ల అక్కడ నేనూ, నా బెడ్, స్టాండుకు వేళాడే సెలైన్ బాటిల్ తప్ప మరేమీ కనిపించేది కాదు. ప్రతీ పది నిమిషాలకు నావద్దకు వచ్చి చూస్తే సిస్టర్, అరగంటకోసారి నన్ను పరీక్షించే డాక్టర్, ఇంతకంటే ఎక్కువగా ఈ వారంరోజులు మరేమీ లేదు.

ఇప్పుడు జనరల్ వార్డుకు మార్చిన తర్వాత బెడ్‌పై కూచోబెట్టడంవల్ల ఇలా ఆసుపత్రి కిటికీ గుండా బయటి నగరాన్ని చూడగలుగుతున్నాను. నాలో నాకే ఏదో తెలియని ఆనందమేదో ఎగిరి గంతేస్తున్నట్లుగా, ఇన్ని రోజులుగా ఎత్తుకున్న బరువేదో దిగిపోతున్నట్లుగా వుంది.

నిజానికి ఎమర్జన్సీ వార్డులోవున్న చివరి రెండు రోజులు మాత్రం నరకం అనుభవించాను. అనుభవం కల చిత్రకారుడు గీసిన చిత్రాల్లో వున్నాయి జూబ్లీహిల్స్ కొండలు, కొండలకు ఇప్పుడిప్పుడే కొన్ని ఇళ్ళు మొలుస్తున్నాయి. కొత్తగా రోడ్లు కూడా వేస్తున్నారు. నగరం ఎంత విస్తరించిపోయింది!

కిటికీగుండా వీస్తున్న పల్లని గాలి లోపలి ఏసి కంటే కూడా బాగుంది. కిటికీగుండా గాలి వీస్తూ బుగ్గలను తాకినప్పుడల్లా నా హృదయం ఎగిరి గంతేస్తుంది. ఎన్ని రోజుల వుతుంది. ఇలాంటి గాలి తగలక! అసలు నేను ఎన్నిరోజులు అపస్మారకస్థితిలో గడిపానో...! కాలం చాలా విచిత్రమైంది. ఏ మలుపులో ఎక్కడ కుదిపివేస్తుందో తెలియదు.

ఈ పల్లని గాలి నా జ్ఞాపకాల పొరలను తడుముతుంది. ఈ జీవితం ఇక్కడితో అంతమైన బాగుండు. నిజానికి నాదో పిరికి కోరిక. ఇలాంటి కోరికను వెలిబుచ్చే వారిని చూస్తే అసహ్యించుకున్న రోజులు నాకు బాగా గుర్తు. కానీ నాకు ఈ స్థితిలో అంతకంటే మార్గం కనిపించడంలేదు. నా స్నేహితులు నాకున్న పుస్తకాల పిచ్చినిబట్టి మేధావిని అన్నారు. ఇంకొందరు నా కవిత్వానికి చెవులు కోసుకున్నారు.

నా లోకం నాది. నా భావుకతల తీగలతో అల్లుకున్న నా స్వర్గసీమ నుండి బయటికిరావాలంటే నాకు గిట్టేదికాదు. అలాంటి నా నిశ్శబ్ద జీవన ప్రయాణంలోకి అనుకోకుండా అడుగిడింది రేఖ. నేనేనాడు ఆమె ఉనికి కోసం పరితపించలేదు. ఏనాడు ఆమె చిరునవ్వుల కోసం పడిగాపులు పడలేదు. కాని ఊహించని వానజల్లులా వచ్చేసింది. నా కథలకు మొదటి పాఠకురాలైంది, నా కవితలకు మొదటి శ్రోత అయ్యింది.

నా రాక కోసం ఎన్ని గంటలైనా ఎదురు చూసేది. నా పాటకోసం ఎన్ని రోజులు గడిచినా ఫర్వాలేదనేది. కళాకారుడికి సహజంగా వుండే మెప్పుకుంటే పొంగిపోయే లక్షణం నాకూ ఉండేది. ఆమె నా పాటను, నన్నూ మెచ్చుకుంటుంటే నా ఆనందానికి హద్దులుండేవి కావు. హిపోక్రసి అంటే నాకు గిట్టేదికాదు. ఆమె ఏదీ దాచుకోకుండా మాట్లాడేస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉండేది. అలా చాలారోజులు మా స్నేహం సాగిపోయింది. చివరికి మా సంగమం స్నేహం నుంచి ప్రేమలోకి మారింది. అదీ ఆమె పొర్షనం వల్లే. ఆమె మాటల్లో, ఆమె చేతల్లో నాపట్ల ప్రేమను వ్యక్తపరిచేది. అయినా నేను ఆమె చేతలను అర్థం కానట్లుగా నటించేవాడిని. నా మౌనాన్ని ఆమె భరించనట్లుగా ముఖం పెట్టేది. చివరికి ఆమె డైరెక్ట్‌గా వచ్చేసింది.

మొదట నాలో ఊగిసలాట బయలుదేరింది. ఏం నిశ్చయించుకోవాలో, ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో తెలియని పరిస్థితుల్లో చాలా రాత్రులు నా కళ్ళు నిద్రకు దూరమయ్యాయి. నాకు ఊహ తెలిసినప్పటినుండి నన్ను నేనే ప్రేమించుకోవడం తెలుసు. కాని ఈ ప్రేమ వ్యవహారం నాకెప్పుడూ ఎరుకపడలేదు. ఒకనాటి వెన్నెల రాత్రిలో రేఖ నా ఒడిలో పడుకుని అపురూపమైన ఆ వెండి వెలుతుర్లలో పాడిన పాట నాకెప్పటికీ గుర్తుంది.

వాడని పూవుల తావిలో
కదలాడే సుందర వసంతమీ కాలము
వెలి జోలగా పాడే వినోదరాగాలలో
తేలాడి కలల సుఖాలతో
ఎదిరించుమిమి ఈ రేయి... నిదిరుంచుమిమి
ఈ రేయి...

పాట పాడుతున్నంతసేపు వెన్నెల కిరణాలు పొదువుకున్న ఆమె పెదాల కదలికను గమనిస్తూ పాటలోని మాధుర్యాన్ని గోలుకునే వాడిని. ఎంత భావుకత దాగివుంది పాటలో. ఎంత కమ్మగా పాడుతుంది రేఖ.

కొద్దిరోజుల తర్వాత ఆమెకు ఉద్యోగం వచ్చింది. నా నిరుద్యోగ జీవితం కదలలేక కదులుతుంది. ఉద్యోగం వచ్చిన తర్వాత జాయిన్ అయ్యే ముందు వచ్చి కలిసింది. కంగ్రాట్స్ చెప్పి ఉద్యోగ వివరాలు అడిగాను. ఆమె విధులు చెప్పింది.

ఉదయ్...! ఎన్నాళ్ళింకా ఉద్యోగంలేకుండాఉంటావు? ఏదైనా ఉద్యోగం చూసుకోరాదు. అంది మాటల మధ్యలో.

ఉద్యోగం అంటే నాకు అసహ్యం కాదు. ఉద్యోగం ఇచ్చే నాధుడి కోసమే నేను వేటాడుతున్నాను.

అయినా నీ లోకం నీది. ఎప్పుడూ ఆ పుస్తకాలు, ఆ కవితలు, కథలు, ఉదయ్... పుస్తకాలు అన్నం పెట్టవు, కథలు జీవితాన్ని ఇవ్వవు, భావుకత బతికించదు. రేఖ మాట్లాడుతూనేవుంది. నా కాళ్ళ క్రింది భూమి కదలిపోతున్నట్లుగా ఉంది. ఆమె మాటల్లో నా స్థాయిని వెక్కిరించే విధానం నాకు స్పష్టంగా అర్థం అవుతుంది. ఏమిటి? రేఖ ఇలా మాట్లాడుతుంది? ఇన్ని రోజులుగా నా రచనలను ఆకాశానికెత్తేసిన రేఖేనా ఈమె?

వస్తా ఉదయ్. నేను వచ్చే నెలలో వస్తాను. వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తాను. ఈలోపు ఎక్కడైనా ఉద్యోగం కోసం ప్రయత్నించు. ఆమె వెళ్ళిపోయింది. నాలో తుఫాను రేపి.

పరిస్థితులు చాలా విచిత్రమైనవి. ఆమె నుండి ఒకటి, రెండు ఉత్తరాలు వచ్చాయి. ఉత్తరం పదిలైన్ల పదాలతో ముగిసేది. నాలో సంఘర్షణ మొదలైంది. నా హృదయం దేని కోసమో పరితపిస్తుండేది. ఏమీ చేయలేని అనిశ్చిత పరిస్థితిలో సిగరెట్లు నా నేస్తాలయ్యాయి.

కాలక్రమంలో ఆమె నన్ను పూర్తిగా మరచిపోయింది. కానీ సమాధానం చెప్పుకోలేని నా మనసుతో ఏకాంత రాత్రుల్లో గుండెలు పగిలేట్టుగా ఏడ్చేవాడిని. ఎన్ని నిశి రాత్రులలో నా బుగ్గలు కన్నీటి వరదలను రుచి చూడాల్సివచ్చేది. ఆ తర్వాత ఒక పత్రికా సంస్థ నన్ను ఉద్యోగం చేయమని ప్రోత్సాహమిచ్చింది. వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా వెళ్ళి జాయిన్ అయ్యాను. ఆ సంస్థ గ్రూపు పత్రికలకు వచ్చే కథలను, కవితలను సెలెక్ట్ చేయడం, ఎడిటింగ్ చేయడం నా పని. జీతం బాగానే వచ్చేది. జీవితాన్ని యాంత్రికం చేసుకోవాలని చాలాసార్లు అనుకునేవాడిని. కానీ సాధ్యమయ్యేదికాదు. రేఖ నా జీవితం నుండి వెళ్ళిన దానికంటే కూడా ఆమె నా జీవితాన్ని చూపిన కోణమే నన్ను వేదనకు గురిచేస్తుంది. ఆమె నా జీవితాన్ని వెక్కిరించిన విధానమే నా గుండెను రంపపు కోత కోసేది. నా హృదయంలో సుడిగుండాలను సృష్టించేది.

హల్లో... ఉదయ్‌గారు. ఇంకా కూచునే [illegible]
ఏమిటి? ఏడుస్తున్నారు. అన్నమాటలతో తలతిప్పి చూశాను. ఎదురుగా తెల్లని దుస్తుల్లో సిస్టర్ నిల్చుని వుంది. ముఖం ప్రక్కకు తిప్పుకుని కళ్ళు తుడుచుకున్నాను.

ఏమిటండీ అంతగా బాధపడుతున్నారు? మీకు వచ్చిన జబ్బు గురించేనా? దాని కోసమే అయితే మీరు బాధపడనక్కరలేదు. ఈ రోజుల్లో ఇలాంటివి సాధారణమైపోయాయండి. కొద్దిసేపు పడుకుంటారా? ఇంజక్షన్ వేయాలి. అంటూ నా రెండు భుజాలను పొదివి పట్టుకొని వెల్లకిలా పడుకోబెట్టింది. ఆ తర్వాత ఇంజక్షన్ వేసింది.

బైదిబై. నా పేరు పద్మప్రియ. ఇప్పుడే డ్యూటీలోకి వచ్చాను. ఇకనుండి నా డ్యూటీ దిగే వరకు మీ పూర్తి బాధ్యత నాపైనే ఉంటుంది. కొద్దిసేపు హాయిగా విశ్రమించండి. అంటూ బ్లాంకెట్ కప్పి వెళ్ళిపోయింది.

ఎలావుంది? కొద్దిసేపు తర్వాత మళ్ళీ వచ్చి అడిగింది. బాగానే ఉందన్నట్టు తల ఆడించాను.

మీరు అనవసరంగా బాధపడుతున్నట్టున్నారు. ప్రస్తుతానికి మీరు తొంభైశాతం బాగైపోయినట్టే. మరో వారంరోజుల్లో డిశ్చార్జి కావచ్చు.

నేను మౌనంగా ఉండిపోయాను.

మీరేం చేస్తుంటారు? అడిగింది పద్మప్రియ. నాకు చెప్పాలనిపించలేదు. చూపులు ప్రక్కకు తిప్పి మౌనంగా ఉండిపోయాను.

చెప్పడం ఇష్టంలేదా...? లేక ఎందుకు చెప్పాలని అనుకుంటున్నారా?

ఒక పత్రికా సంస్థలో పనిచేస్తాను.

ఓహో జర్నలిస్ట్ అన్నమాట. వార్తలు రాస్తుంటారా?

కాదు. కథల్ని, కవితల్ని ఎడిటింగ్ చేస్తుంటాను.

అయితే కవిగారన్నమాట.



మళ్ళీ వస్తాను... అంటూ ఆమె మరో పేషెంట్ బెడ్ దగ్గరికి వెళ్ళింది.

నాకు మళ్ళీ లేచి కూర్చుంటే బాగుండుననిపించింది. కానీ నాకు నేనుగా లేవలేని పరిస్థితి నాది. ఈ పరిస్థితి నాకు దుర్భరంగా అనిపిస్తోంది. ఛ. ఏమిటీ మనిషి జీవితం... సిస్టర్ మళ్ళీ తిరిగి నా బెడ్ దగ్గరకు వచ్చింది. సిస్టర్... నన్ను కొద్దిగా తిరిగి కూచోబెడతారా అన్నాను.

కూర్చుంటారా... సరే... అంటూ నా [illegible] కూచోపెట్టింది.

ఏమైనా తీసుకుంటారా? వద్దన్నట్టుగా తల ఊపాను. ఈ టానిక్ తీసుకోండి. అంటూ స్పూన్‌లో టానిక్ పోసి పెదాల దగ్గరగా పెట్టింది. ఎడంచేత్తో నా తలను పట్టుకొని స్పూన్‌ను నా నోట్లోకి వంచింది. టానిక్కు మింగి సిస్టర్ వంక చూసాను. ప్రపంచంలోని ప్రశాంతతంతా ఆమె ముఖంలోనే వుంది. కొన్ని క్షణాలు అలాగే చూస్తూ ఉండిపోయాను. ఇంకో స్పూన్ కూడా తాగాలి... అంటూ స్పూన్‌ను మళ్ళీ నా పెదాల దగ్గరకు తెచ్చింది. నేను ఆమె ముఖంలోకి చూశాను. నాలో దుఃఖం సుళ్ళు తిరుగుతోంది. నాకు అమ్మ జ్ఞాపకం వచ్చింది. అల్లరి వయసున నేసే మంకుకు బుజ్జగించి గోరుముద్దలు తినిపించే ఆత్మీయత ఆమె చేతుల్లో.

ఊఁ... తాగండి... చేదుగా వుందా!?

●●●●

అంతా చీకటిగా వుంది... ఆ భయంకర చీకట్లో నేను ఒక్కడినే ఒంటరిగా నడుస్తున్నాను. ఎటు వెళుతున్నానో తెలియదు.

## చెమక్ సింగ్

నడక... నడక... నడక... నడుస్తూనే ఉన్నాను. నడుస్తూ... నడుస్తూ ఒక్కసారిగా నన్నెవరో ఆపేశారు. బలవంతంగా ముందుకు అడుగువేసే ప్రయత్నం చేస్తున్నాను. కానీ ముందుకు కదలడానికి వీలులేకుండా వెనక నుండి ఎవరో గట్టిగా లాగి పడుతున్నారు. పట్టుకున్నదెవరో ఆ చీకట్లో నాకు కనిపించడంలేదు. నేను ముందుకు వెళ్ళడానికి గింజుకుంటున్నాను. నా నరాలను సాగతీసుకుని ముందుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నాను. నరాలు తెగుతున్న భావన. రక్తం ఒలికిపోతున్న అనుభూతి. నా తల నుంచి మెదడు బయటికి వచ్చి నా ముఖం ముందు వ్రేలాడుతుంది. ఒక్కసారిగా ఫట్‌మని నా నరాలు తెగిన చప్పుడు. ఆ భయకంపితం నుండి అప్రయత్నంగా నా గొంతు నుండి ఓ భయంకర కేక.

ఏమైంది...? ఏమైంది...?

ఏమైంది ఉదయ్‌గారు. పద్మప్రియ నా భుజాలు పట్టి కుదిపేస్తోంది. నా శరీరం చెమటతో పూర్తిగా తడిసిపోయింది. నా ఊపిరి వేగంగా కదులుతోంది. బెడ్‌లో కూచుని ఉన్నాను. పక్క బెడ్స్‌లో నుండి ఇద్దరు ముగ్గురు పేషంట్స్ లేచి కూర్చుని నావంకే చూస్తున్నారు.

ఏమైంది...? ఏదైనా కలగన్నారా?

కలా...? అవును కలే...! నా తలను పొదివి పట్టుకుని నిమురుతోంది పద్మప్రియ. ఏదో పీడకల వచ్చినట్టుంది మీకు. అందుకే అంత పెద్దగా కేకవేస్తూ లేచి కూర్చున్నారు. ఆమె తెల్లని చీరలో నా ముఖం ఒదిగిపోయింది. అద్వితీయమైన భావన. చిన్నప్పుడు అమ్మ ఒడిలో సేద తీరుతున్న భావన.

ఉదయ్‌గారు... మీరు దేనికోసమో బాధపడుతున్నట్టున్నారు. ఇంత రాత్రివేళ కూడా మీరు మీ బాధను మరిచి హాయిగా నిద్రపోలేకపోతున్నారు. ఏ విషయంలోనో పదేపదే ఆలోచిస్తున్నట్టున్నారు. మీరు శారీరకంగా పూర్తిగా కోలుకున్నారు. కానీ మానసికంగానే మీ ఆందోళనను తగ్గించుకోండి. మీ సమస్య జటిలమైందే కావచ్చు. నేను దానికి పరిష్కార మార్గం చూపించలేకపోవచ్చు. కానీ బాధపడడం సమస్యకు పరిష్కారం కాదు. నాకు మీలాగ కవిత్వం తెలియదు. కాబట్టి మాటలను అందంగా చెప్పడం నాకు చేతకాదు. మీకున్న విజ్ఞానంలో నాకు తెలిసింది కూడా రవ్వంత కాదు. ప్రతి మనిషీ సమస్యలను జీవితాంతం గుర్తుంచుకుని బాధపడుతూ వుంటే ఈ పాటికి ఈ సమాజం పిచ్చిదైపోవాలి. మరుపు మనిషికి వరం. ఆ వరాన్ని కైవసం చేసుకోవడం మీకు పెద్ద సమస్య కాదు ప్రయత్నం చేస్తే. మీ నుండి భవిష్యత్‌లో మంచి రచనలెన్నో వెలువడాలి. మీరు మీకోసం కాకున్నా సమాజంకోసమైనా ప్రశాంతంగా గడపాలి. సమాజం అవసరం మీకులేదని మీరు అనుకోవచ్చు. అయినా సమాజానికి మీ అవసరం ఎంతైనా వుంది.

పద్మప్రియ మాట్లాడుతూనేవుంది. మాటలు... మనిషి మనస్సును కడిగే మాటలు...నా మనో ఫలకాన ఏదో కొత్త లోకం రూపాన్ని పులుముకుంటుంది.

●●●●

బయటి పక్షుల అల్లరికి మెలకువ వచ్చింది. బెడ్‌పై కూచుని ప్రక్కకు చూసాను. నాకింకా ఆసుపత్రిలో ఉన్నట్టుగానే అనిపిస్తోంది. తీరాచూస్తే నా గది. నిన్న డిశ్చార్జి అయి వచ్చి భోంచేసి పడుకుంటే ఇంతవరకూ మెలకువ రాలేదు.

ఒళ్ళు విరుచుకుని లేచి కిటికీ తెరిచి బయటకు చూపును సారించాను. బయట గులాబి చెట్టు నిండుగా ఓ పూవును పూసింది. పెద్ద గులాబి. చాలా అందంగా వుంది. రాత్రి కురిసిన మంచుబిందువులు దాని రేకులపై నిలిచాయి. గాలికి చిన్నగా అటూ ఇటూ కదులుతూంది. ఆ గులాబి పూవు మధ్య ఓ రూపం చిరునవ్వుతో ఏదో చెప్తోంది.

ఆ రూపం పద్మప్రియది. ●